ప్రజాశక్తి
బుధవారం 18 అక్టోబర్ 2023 5
పార్వతీపురం మన్యం

ఒంటరి ఏనుగు పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఒంటరి ఏనుగు హరి మంగళవారం సాయంత్రం నుండి కనబడడం లేదని అటవీ శాఖ అధికారులు తెలిపారు. జియమ్మ వలస మండలం కుందర తిరువాడలో గత నాలుగు రోజులుగా ఉన్న ఏడు ఏనుగుల గుంపులో కలిసే అవకాశం ఉందన్నారు. అది ఏ సమయంలో ఎక్కడ ఉంటుందో చెప్పలేమని సమీప గ్రామాల ప్రజలు రాత్రివేళ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దళాయిపేట, బిత్రపాడు, పాత నిమ్మలపాడు , సీమ నాయుడువలస, బాసంగి, గదబవలస, వెంకటరాజపురం, పాత గిజబ, గిజబ, చింతల బెలగాం, సింగనాపురం, దత్తి వలస, చినకుదమ, పెదకుదమ వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. ఆ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు.

విద్యుత్‌ఛార్జీల భారంతో విజయనగరం జిల్లాలోనూ, రాష్ట్ర వ్యాప్తంగా ఫెర్రో పరిశ్రమలు కుదేలయ్యాయి. ఆర్థిక ఇబ్బందులతో కొన్ని ఇప్పటికే మూతపడగా, మరికొన్ని ఒడిదుడుకుల మధ్య నడుస్తున్నాయి. ఒక్క విజయనగరం జిల్లాలో మూతపడ్డ పరిశ్రమల వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2వేల కుటుంబాలు జీవనోపాధి కోల్పోయాయి. మిగిలినవి మూతపడితే ఇబ్బందులు పడే కార్మిక కుటుంబాల సంఖ్య మరింతగా పెరుగుతుంది. ఈనేపథ్యంలో ఇటు కార్మికులు, అటు యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి చలనం లేకపోవడం గమనార్హం. విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా ఈనెల 19న సిపిఎం ఆధ్వర్యాన విజయనగరంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నారు.

మూతపడిన ఇంపెక్స్ పరిశ్రమ

విద్యుత్తు ఛార్జీల భారంతో కుదేలైన 'ఫెర్రో'

- ఉపాధి కోల్పోయిన వేలాది కుటుంబాలు
- చలించని ప్రభుత్వం
- విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా రేపు సిపిఎం రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో గరివిడి, గుర్ల, మెరకముడిదాం, బొబ్బిలి, కొత్తవలస ప్రాంతాల్లో 21 వరకు ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ఉండేవి. వీటిలో చాలా కాలం క్రితమే మూడు మూతపడ్డాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి విద్యుత్ ఛార్జీలు పెంచడంతో భారాన్ని తట్టుకోలేక బొబ్బిలిలో ఉన్న సిరి ఫెర్రో, యోన, ఇంపెక్స్, గరివిడిలో ఉన్న ఆంధ్రా ఫెర్రో సహా మొత్తం 10 పరిశ్రమలు మూతపడ్డాయి. గరివిడి ఫేకర్‌లో ఉత్పత్తి తగ్గించడం వల్ల ఒకే ఒక్క ఫర్నేచర్ నడుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి. ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణం. ఫెర్రో క్రోమ్ ఉత్పత్తిలో విద్యుత్తు వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఛార్జీలు పెంచితే అనివార్యంగా వాటి మనుగడ భారమౌతుంది. వైసిపి అధికారంలోకి రాకముందు యూనిట్ విద్యుత్తు రూ.4.95కు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ కింద మరో 5పైసలు కలిపి.. యూనిట్ రూ.5కే ఇచ్చేవారు. ఛార్జీలు భారంగా మారడంతో విద్యుత్తు రాయితీల కోసం యాజమాన్యాలు చాలా ఏళ్లుగా ప్రభుత్వానికి విజ్ఞాపనలు చేస్తూనే ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో విద్యుత్ రాయితీలు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఛార్జీలు మరింతగా పెంచింది. పరిశ్రమలకు ప్రస్తుతం సరఫరా చేస్తున్న ధరపై అదనంగా యూనిట్‌కి రూ.3 చొప్పున పెంచారని యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. టన్ను ఉత్పత్తిపై అదనంగా రూ.10 వేల వరకు భారం పడుతుందని చెబుతున్నాయి. నెలకు రూ.2కోట్ల వరకు అదనపు బిల్లు వస్తోందని బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లోని ఒక ఫెర్రో పెద్ద పరిశ్రమ యజమాని ఆవేదన వ్యక్తం చేశాడు. తమకు రూ.30లక్షల నుంచి రూ.50లక్షల వరకు అదనపు ఛార్జీలు వస్తున్నాయని చిన్న పరిశ్రమల యజమానులు చెబుతున్నారు. మిగిలిన యాజమాన్యాలు కూడా అత్యంత క్లిష్టమైన పరిస్థితుల నడుమ నడుపుతున్నామని, ఇదే పరిస్థితి కొనసాగితే ఎన్నాళ్లో నడపలేమని చెబుతున్నాయి. దీనికితోడు అంతర్జాతీయంగా నెలకున్న పోటీవల్ల స్టీల్ తయారీకి అవసరమయ్యే ఫెర్రో సిలికాన్, మాంగనీస్ వంటి ఉత్పత్తులకు తగిన ధర పలకడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఫెర్రో పరిశ్రమలను మూసివేసేందుకు ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమల అసోసియేషన్ కూడా ప్రభుత్వానికి అనేక సార్లు సమస్యను విన్నవించింది. మరోవైపు కార్మికులు సిఐటియు ఆధ్వర్యాన ఆగస్టు 1న విజయనగరం కేంద్రంగా ఫెర్రో ఎల్లాయిస్ కార్మికుల సదస్సు చేపట్టిన సంగతి తెలిసిందే. తాజాగా విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన విజయనగరంలో గురువారం సదస్సు నిర్వహిస్తున్నారు.

20 నుంచి రాగుల కొనుగోలు కేంద్రాలు

ప్రజాశక్తి - బెలగాం

ఈ నెల 20 నుంచి రైతు భరోసా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన రాగుల కొనుగోలు కేంద్రాలు పని చేయడం ప్రారంభించనున్నాయని జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్ తెలిపారు. కావున రైతులు పండిచిన రాగులను ప్రభుత్వం ప్రకటించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా దగ్గరలో గల రాగుల కొనుగోలు కేంద్రం వద్ద విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను పొందాలని ఆయన కోరారు. రాగులకు ప్రభుత్వం క్వింటాలుకు 3846 రూపాయలను మద్దతు ధరగా ప్రకటించిందని చెప్పారు. వ్యవసాయ శాఖ అంచనాల మేరకు జిల్లాలో 936 మెట్రిక్ టన్నుల దిగుమతి వస్తుందని అందులో స్థానిక వినియోగం మినహా 468 మెట్రిక్ టన్నులు కొనుగోలుకు వస్తాయని అంచనా వేస్తున్నామని అన్నారు. వ్యవసాయ శాఖ అంచనాలకు అనుగుణంగా రైతుల సౌకర్యార్థం జిల్లాలో సీతంపేట, సాలూరు, పాచిపెంట, పార్వతీపురం, కొమరాడ, కురుపాం, గుమ్మలక్ష్మీ పురంలో గల 49 రైతు భరోసా కేంద్రాలను 11 రాగుల కొనుగోలు క్లస్టర్లుగా గుర్తించినట్టు తెలిపారు. రాగుల కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సమస్యలు, సమాచారానికి కంట్రోల్ రూమ్ ను (ఫోన్ నంబరు 08963221003) ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. రాగుల కొనుగోలుకు సంబంధించి రైతుల సందేహాల నివత్తి, సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఉదయం 6 గంటల నుండి రాత్రి 8గంటల వరకు నేరుగా ఫోన్ చేసి సంప్రదించ వచ్చని చెప్పారు.

ఎల్విన్‌పేటలో సచివాలయ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

భవన నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నిర్మాణాలు పూర్తికావచ్చిన ప్రాధాన్యతా భవన నిర్మాణాలను వెంటనే పూర్తిచేసి సంబంధిత శాఖలకు అప్పగించాలని జిల్లా కలక్టరు నిశాంత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం ఎల్విన్‌పేటలో ప్రాధాన్యతా భవనాల నిర్మాణపనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ గ్రామ స్థాయిలోనే ప్రజలకు అవసరమైన సేవలన్నింటిని అందించేందుకు సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చిందని, అందుకు అవసరమైన భవనాల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిచ్చి భవనాలకు మంజూరు చేసిందని అన్నారు. నిర్మాణ పనులు ఆఖరి దశలో గల భవనాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పూర్తిచేయాలని ఇంజనీరింగు అధికారులను ఆదేశించారు. నిర్మాణపనులకు అనుకూలమైన సమయమని కావున సాధ్యమైనంత త్వరగా భవనాలు పూర్తిచేసి, సంబంధిత శాఖలకు అప్పగించాలని తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

19న ప్రెస్ అకాడమీ ఛైర్మన్ రాక

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈనెల 19న జిల్లాకు వస్తున్నారని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 19న ఉదయం 9.30 గంటలకు పార్వతీపురం చేరుకుంటారని, 10 గంటలకు స్థానిక లయన్స్ క్లబ్ లో "అభివద్ధి పథంలో ఆంధ్ర ప్రదేశ్" శీర్షికన నిర్వహిస్తున్న సమావేశంలో పాల్గొంటారని ఆయన వివరించారు. అనంతరం బయలుదేరి అరకు వెళతారని ఆయన పేర్కొన్నారు.

కాలువల్లో పూడికలను, గుర్రపుడెక్కలను తొలగిస్తున్న రైతులు

రైతులకు తప్పని తిప్పలు

సాగు నీటి కోసం అవస్థలు

ప్రజాశక్తి - బలిజిపేట

ప్రతి ఏడాదిలాగే పెదఅంకలాం రిజర్వాయర్ నుంచి సాగునీరు బలిజిపేట మండల రైతులకు అందని ద్రాక్షలా మారింది. జైకా నిధులు సుమారు రూ.17కోట్లు కాలువ అభివృద్ధి పనులకు కేటాయించారు. అయితే ఈ నిధులను అధికారులు, పాలకులు ఏం చేశారో తెలియదు కానీ రైతులకు మాత్రం సాగునీరందక తీవ్ర అవస్థలుపడుతున్నారు. కాలువ పనులు, పూడికతీతలు తీయకపోవడంతో సాగునీరందక పలగర, చిలకలపల్లి గ్రామాల రైతులు శ్రమదానంతో వారి పనులను పూర్తి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆనకట్టు ప్రధాన కాలువలో పూడికపోయిన గుర్రపు డెక్కలను తీస్తూ, చప్టాలను, ఇసుక బస్తాలతో కప్పుకుంటూ పూర్తిగా ఎండిపోయిన వరి పంట సాగు నీటి కోసం వారు నానా తిప్పలు పడుతున్నారు. సొంత గ్రామానికి చెందిన ఎమ్మెల్యే మన వారే అయినా సాగు నీరు సమస్య మాత్రం పరిష్కారం కావడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు తమ ఇబ్బందులు పట్టించుకోకపోవడంతో చివరి భూములను సాగునీరందడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చివరి భూమి రైతులకు నీరందేలా ప్రయత్నం చేయాలని స్థానిక నాయకులు ఈ విషయంపై దృష్టి పెట్టాలని, ఆ దిశలో ఉన్న పంటను కాపాడాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

పక్కా ప్రణాళికతో ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను పక్కా ప్రణాళికతో కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్ల సంఘ సభ్యులతో 2023-24 సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియకు అనుసరించాల్సిన విధానంపై సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో 83 కొనుగోలు కేంద్రాలకు సుమారు 80లక్షల మేరకు గోనె సంచులు అవసరం కాగా మొదటి దశలో 20 లక్షల గోనె సంచులను వారం రోజుల్లోగా ఆయా రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేసి నిల్వ ఉంచాలని స్పష్టం చేశారు. ధాన్యం తరలించేందుకు రైతులు సొంత లేదా వేరే రవాణా వాహనాలు ఏర్పాటు చేసుకున్నట్లయితే జి పీస్ పరికరాన్ని తప్పకుండా అమర్చుకోవాలని సూచించారు. లేని పక్షంలో రవాణా చార్జీలు ప్రభుత్వం చెల్లించదని వివరించారు. ఆర్డీవో, ఉప రవాణా కమిషనర్ ధాన్యం రవాణా సక్రమంగా జరిగేలా పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. రైతు భరోసా కేంద్రం వద్ద నిర్ధారించిన ధాన్యంలోని తేమ సామర్థ్యం, మిల్లర్లు తనిఖీ చేసిన ధాన్యం తేమ సాంద్రత శాతం రైతులకు ఇబ్బంది లేకుండా ఒకే విధంగా నమోదు చేయాలన్నారు. మిల్లింగ్ సామర్థ్యం, గోనె సంచులు నిల్వ, బ్యాంక్ గ్యారంటీలు రైస్ మిల్లర్లు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. రైతులు గోనె సంచులు ఏర్పాటు చేసుకున్నట్లయితే వాటి ఛార్జీలను చెల్లిస్తామన్నారు. పక్క రాష్ట్రాల నుండి అక్రమంగా ధాన్యం కొనుగోలు జరగకుండా అడ్డుకట్ట వేయడానికి ఈ క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతుల వద్ద నుండి మాత్రమే ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలులో రైతులు బయోమెట్రిక్ నమోదు తప్పనిసరిగా చేయాలన్నారు. రైతులకు గోనే సంచులు సరఫరా అయ్యేలాఆన్లైన్ నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. సరఫరా చేసిన ప్రతి గోనె సంచి మరలా తిరిగి చేరాలని, ఎక్కడా దుర్వినియోగానికి తావివ్వరాదని చెప్పారు. రైతు భరోసా కేంద్రంలో ధాన్యం ఉత్పత్తి, రవాణా, రవాణా చార్జీలు చెల్లింపు , వివరాలను ఖచ్చితంగా, పారదర్శకంగా నమోదు చేయాలన్నారు. మిల్లర్లకు ఉన్న సమస్యల పరిష్కారం కొరకు ఇప్పటికే ప్రభుత్వ దష్టికి జిల్లా కలెక్టర్ తీసుకువెళ్లినట్లు తెలిపారు. రైతులకు ధాన్యం కొనుగోలులో ఇటువంటి సందేహాలు, ఇబ్బందులు ఉన్నా పరిష్కరించేందుకు జిల్లా కేంద్రంలో గల రెవెన్యూ, రవాణా శాఖ, సహకార, వ్యవసాయ శాఖ, జిల్లా పౌర సరఫరాల అధికారులు అందుబాటులో ఉండి పనిచేసేలా కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 1967 టోల్ ఫ్రీ నెంబర్ కు సంప్రదించాలని కోరారు.

కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.హేమలత, జిల్లా పౌర సరఫరాల అధికారి అర్.శివ ప్రసాదరావు, జిల్లా జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఎమ్.దేవుళ్ల నాయక్, జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ పథక సంచాలకులు వై.సత్యంనాయుడు, ఆర్‌టిఒ సి.మల్లిఖార్జున రెడ్డి, జిల్లా సహకార అధికారి బి.సన్యాసి నాయుడు, జిల్లా మార్కెటింగ్ సహాయ సంచాలకులు వై.సుధీర్, జిసిసి డిఎం వి.మహేంద్ర కుమార్, సీతం పేట జిసిసి కష్ణ, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, మిల్లర్ల యజమానులు, తదితరులు పాల్గొన్నారు,

హౌసింగ్ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న పిఒ కల్పనాకుమారి

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

గృహ నిర్మాణాల్లో పురోగతి పెంచాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. మంగళవారం హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గృహ నిర్మాణ లబ్దిదారులకు అవగాహన కల్పించి పనులను వేగవంతం చేయాలన్నారు. లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లే అవుట్లలో ఉన్న సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అన్నారు. అనంతరం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. పూర్తయిన పనుల బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇంకా ప్రారంభం కానీ పనులను ప్రారభించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డిఇ మోహనరావు, ఎఇలు వెంకటేష్, పాపారావు, కిరణ్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ఢిల్లీశ్వరారావు, పిఆర్ డిఇ లోకనాథం, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెలగాం: గృహ నిర్మాణాలపై సాలూరు నియోజక వర్గ స్థాయి సమీక్షా సమావేశాన్ని పార్వతీపురం ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ చాంబరులో నిర్వహించారు. ఇళ్ల మంజూరై ఇంకా నిర్మాణాలు ప్రారంభించని లబ్దిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించి వెంటనే ప్రారంభించేలా ప్రోత్సహించాలని తెలిపారు. జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులు వేగవంతాలనికి అవసరమైన మౌళిక సదుపాయాలు కొరత లేకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో హౌసింగు డిప్యూటీ ఇంజనీర్లు, సహాయ ఇంజనీర్లు పాల్గొన్నారు.

సర్వర్ మొరాయించడంతో నిలిచిపోయిన రేషన్ పంపిణీ

రేషన్ పంపిణీలో తీవ్ర జాప్యం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలో గడువు తేదీ దాటి మూడు రోజులైనప్పటికీ రేషన్ బియ్యం పంపిణీ జరగకపోవడంతో రేషన్‌దారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా 15లోగా ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ జరగాల్సి ఉండగా గత పది రోజులుగా సర్వర్ సమస్య వల్ల రేషన్‌దారుల బయోమెట్రిక్ గుర్తింపు జరగకపోవడంతో రోజుకు కేవలం ఐదు, పది కార్డులకు మాత్రమే బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈనెల 18వ తేదీ సమీపిస్తున్నప్పటికీ 50శాతం కూడా ఏ గ్రామంలోనూ రేషన్ పంపిణీ జరగకపోవడంతో వినియోగదారులు ఈనెల రేషన్ కోల్పోతామేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మండల సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్‌ను ప్రశ్నించగా సాంకేతిక లోపం తలెత్తిన మాట వాస్తవమేనని, ఈ విషయమై జిల్లా అధికారులు దృష్టికి తీసుకువెళ్లామని, రేషన్ పంపిణీ గడువు ప్రాథమికంగా ఈ నెల 19 వరకు పొడిగించినప్పటికీ, నెలాఖరు వరకు రేషన్ పంపిణీ కొనసాగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అధికారులు ఆమోదం తెలిపితే రేషన్ పంపిణీ అందరికీ అందే వరకు కొనసాగిస్తామని తెలిపారు.

20న ద్విచక్ర వాహనాలు వేలం

ప్రజాశక్తి - కురుపాం

నాటు సారా తరలిస్తుండగా పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలను ఈనెల 20న స్థానిక ఎస్ఇబి కార్యాలయం వద్ద వేలం వేస్తున్నట్లు ఎస్సై బివి నాగభూషణరావు తెలిపారు. నాలుగు ద్విచక్ర వాహనాలు వేలం వేస్తున్నామని ఆసక్తి గలవారు వేలంలో పాల్గొన్నవచ్చన్నారు.

అనర్హులకు పింఛన్లు

- సామాజిక తనిఖీలో వెలుగులోకి వచ్చిన నకిలీలు
- ఒక్క తూరుమామిడి పంచాయతీలోనే 23 మంది గుర్తింపు

ప్రజాశక్తి -మక్కువ

ఏమండీ మీకు పెన్షన్ వస్తుందా.? వస్తుందండి.. ఏం లోపంతో మీకు పెన్షన్ ఇచ్చారు? కాలు బాగోలేదు... నాకు చెయ్యి బాగోలేదు అని గట్టిగా సమాధానం చెబుతూ తనిఖీకి వెళ్లిన అధికారులకు మైండ్ బ్లాక్ అయ్యేలా.. వారి చెవులు రింగ్ మనీ లా ఒక్కొక్కరు చెబుతూ ఉంటే పింఛను ధ్రువపత్రం తనిఖీ చేసిన డిఆర్‌పిలు, ఇతర సిబ్బంది నిర్ఘాంతపోవాల్సిన పరిస్థితి ఎదురైంది. ఎందుకంటే వారికి సదరంలో ఇచ్చిన ధ్రువపత్రంలో వినికిడి లోపంగా ఉండడమే దీనికి కారణం. అలాగే కొంతమంది మహిళలకు భర్తలు ఉన్నప్పటికీ ఒంటరి మహిళలుగా ధ్రువపత్రాలు జారీ చేస్తూ పెన్షన్లు అందించిన తీరు కూడా ఈ తనిఖీల్లో వెలుగు చూశాయి. వివరాల్లోనికి వెళ్తే...

మండలంలోని 17వ సామాజిక తనిఖీని ఇటీవలే నిర్వహించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు అధ్యక్షతన ప్రజావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులతో పాటు వైయస్సార్ పెన్షన్ కానుకలపై కూడా సామాజిక తనిఖీలు నిర్వహించిన అధికారులు గ్రామాల వారి వివరాలతో కూడిన నివేదికను వెలువరించారు. ఇందులో తూరుమామిడి, కొయ్యన్నపేట వెంకటబైరపురం గ్రామాల్లో నకిలీ వికలాంగు ధ్రువపత్రాలు పొంది పెన్షన్లు పొందుతున్న వారిని ఆడిట్లో గుర్తించినట్టు ప్రజాదర్బార్లో ఆయా డిఆర్‌పిలు నివేదిక సమర్పించారు. ఒక్క వెంకటబైరిపురంలోనే 53 నకిలీ వికలాంగ, ఒంటరి మహిళ పింఛన్లు పొందుతున్నట్టు గుర్తించారు. ఇటీవల పుట్టగొడుగుల్లా నకిలీ వికలాంగులు పుట్టుకొస్తున్నారని, దీనికి సంబంధించి ఓ పెద్ద రాకెట్ ఉందని మండలంలోని సిపిఎం ఇటీవల పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు.

అధికారులకు నివేదికను వివరిస్తున్న డిఆర్‌పిలు

మండలంలో దాదాపు 8,192 మంది ప్రభుత్వ పింఛన్లు వివిధ రూపాల్లో పొందుతున్నారు ఇటీవల జరిగిన తనిఖీల్లో కూడా నకిలీ వ్యవహారాలు బహిర్గతమయ్యాయి. అలాగే ఉపాధి హామీ పనుల్లో కూడా మస్తర్లపై సంతకాలు, వేలిముద్రలు లేకుండానే బిల్లును చెల్లించిన అంశాలు మండలంలోని దబ్బగెడ్డ, కవిరిపల్లి, కొయ్యన్నపేట, చెముడు పంచాయతీల్లో కూడా వెలుగు చూశాయి. స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్లు సక్రమంగా పనిచేయడం లేదని ఈ సందర్భంగా జడ్పిటిసి సభ్యులు ఎం.శ్రీనివాసరావు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఉపాధిహామీలోకి ఇరిగేషన్ కాలువలు, ఇతర వ్యవసాయ ఆధారిత పనులను చేర్చాలని, తద్వారా రైతులకు మేలు చేయాలని ఆయన ఈ సందర్భంగా అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎపిడి శ్రీహరి, ఎపిఒ రత్నకుమారి, ఎండిపిఒ సూర్యనారాయణ, ఎస్ఆర్‌పిలు, ఉపాధి హామీ సిబ్బంది, ప్రతినిధులు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

కేంద్రం నిర్ణయం ఏమాత్రం బాగోలేదు

ఉపాధి హామీ చట్టానికి ఇటీవలే కేంద్ర ప్రభుత్వం నిధులను తగ్గించడం ఏమాత్రం బాగాలేదని జడ్పిటిసి సభ్యులు మామిడ శ్రీనివాసరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. సోషల్ ఆడిట్ అనంతరం ప్రజా దర్బార్ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో యుపిఎ ప్రభుత్వం నిరుపేదలకు బంగారు బాతు గుడ్డు లాంటి చట్టం తెచ్చిందని, కానీ ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేసేలా ప్రస్తుత చేసే పనులు అనిపిస్తున్నాయని ఆయన అన్నారు. ఈ చట్టానికి అందించాల్సిన నిధులు కోత వేయడం సమంజసంగా లేదని ఈ సందర్భంగా అన్నారు. ఈ చట్టం వల్ల 17 ఏళ్లుగా గ్రామీణ ప్రాంత నిరుపేదల్లో ఎన్నో ఆశలు చిగురించాయని ఆర్థికంగా నిలబెట్టుకోగలిగారని ఈ సందర్భంగా గుర్తించేశారు.

గంజాయి రవాణాకు అడ్డుకట్ట : డిఐజి

ప్రజాశక్తి- శృంగవరపుకోట, విజయనగరం

గంజాయి రవాణా నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటామని విశాఖ రేంజ్ డిఐజి హరికృష్ణ తెలిపారు. మంగళవారం శృంగవరపుకోట పోలీస్ స్టేషన్‌ను, విజయనగరంలో ట్రాఫిక్ స్టేషన్‌ను పరిశీలించారు. ఎస్.కోటలో విలేకర్లతో మాట్లాడారు. బొడ్డవర చెక్ పోస్ట్ కు సమీపంలో చిలకల గడ్డ వద్ద ఒక గుర్తింపు లేని రహదారి గుండా గంజాయి రవాణా సాగుతుందని విలేకర్లు చెప్పగా సిఐ బాల సూర్యారావుని వివరాలు అడిగి తెలుసుకుని అక్కడ కూడా భద్రత ఏర్పాటు చేయాలని తెలిపారు. పట్టణంలో ఆకతాయిల ఈవ్ టీజింగ్, బైక్ రేసింగ్, అర్ధరాత్రి 12గంటల వరకు యువత రోడ్లపై తిరగడం వంటి అంశాలపై ప్రశ్నించగా వెంటనే వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సిఐని ఆదేశించారు కార్యక్రమంలో ఎస్ కోట, ఎల్ కోట, జామి, వేపాడ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలుపాల్గొన్నారు.

విజయనగరంలో డిఐజి మాట్లాడుతూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండాచూడాలని, ఓవరు లోడు వాహనాలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. సిడిఫైల్‌స పనితీరును, స్టేషన్ ప్రాంగణాన్నిపరిశీలించారు. ఎఎస్‌పి అస్మాఫర్హీన్, డిఎస్‌పి విశ్వనాథ్, ఎస్ఐలు పాల్గొన్నారు.

శిక్షణ వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - సీతంపేట

సవర భాష వాలంటీర్ల వృత్యాంతర శిక్షణ వినియోగించుకోవాలని ఐటిడిఎ పిఒకల్పనకుమారి అన్నారు. మంగళవారం స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సవర భాష వాలంటీర్ల వృత్తాంతర శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యే మాట్లాడారు. ఇక్కడ శిక్షణను సద్వినియోగించుకొని విద్యార్థులకు సులభ పద్ధతిలో బోధించాలన్నారు. విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలన్నారు. అనంతరం జిపిఎస్ పాఠశాలల సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఉప విద్యాశాఖ అధికారి ఎ.లిల్లీరాణి, ఎఎంఒ పి.కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.నదల్చిన వారు ముందుగా రూ.2వేలు రుసుం చెల్లించి పాల్గొవాలని వాహనాలు కైవసం చేసుకొని వారికి తిరిగి రుసుము చెల్లించడం జరుగుతుందని అన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రకాశరావు

మండలంలోని తోటపల్లి వద్ద గల కీర్తి శేషులు గరిమెళ్ల నారాయణ స్మారక గ్రంథాలయం మంగళవారం జట్టు ట్రస్ట్ తోటపల్లి కార్యాలయంలో ప్రారంభిం చారు. ఈ గ్రంథాలయాన్ని తేజో సంస్థ వ్యవస్థాపకులు పిఎస్ ప్రకాశరావు ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎం.శ్రీరాములు, రచయితలు రౌతు వాసుదేవ రావు, ఎస్.బాలకృష్ణ, తుంబలి శివాజీ, దబ్బీరు గోవిందరావు, కిలపర్తి దాలి నాయుడు, బెహరా ఉమామహేశ్వర రావు, గ్రంథాలయ సంఘం జిల్లా అధ్యక్షులు త్రాసుల శివకేశవ రావు, ఎల్.వెంకట స్వామి, డాక్టర్ ఎం.గోపీనాథ్, పెంకి గౌరీశ్వరరావు, సత్యవతి, అన్నపూర్ణ, అల్లువాడ కైలాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గ కేంద్రమైన కురుపాం సాయిరాం గుడి దగ్గరలో గల కురుపాం నుండి గుమ్మలక్ష్మీపురం వెళ్లే ప్రధాన రహదారికి పక్కన సర్వేనెంబర్ 27 - 2లో గల 60 సెంట్లు ప్రభుత్వ భూమేనని ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎ.సాంబమూర్తి తెలిపారు. ఈ భూమిని కురుపాం గ్రామానికి చెందిన ఒక నాయకుడు రూ.40 లక్షలకు అమ్మగా జెసిబితో లెవెలింగ్ చేయిస్తున్న సమయం లో అక్కడికి వెళ్లిపనులు ఆపించడం జరిగిందని తహశీల్దార్ తెలిపారు. ఈ భూమి రెవెన్యూ రికార్డులో ప్రభుత్వ భూమిగా ఉందని, మంగళవారం ఆ భూమి వద్ద ఇది ప్రభుత్వ భూమేనని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామని, ఈ ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

చదవడం మాకిష్టం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

స్థానిక శాఖా గ్రంథాలయంలో దసరా సెలవులు సందర్భంగా పిల్లలకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా పరవస్తు చిన్నయ సూరి రచించిన మిత్ర లాభం, మిత్రబేధం అను కథలను చదివించినట్టు నిర్వాహకులు నల్ల మధుసూదనరావు రావుతో తెలిపారు. వాటిలోని సారాంశాలను ప్రతి విద్యార్థిని విద్యార్థులను అడిగి వారిలో పోటీ తత్వాన్ని పెంపొందించడం జరిగిందన్నారు. అలాగే విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిం చామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు.

అధికారులకు, ప్రజాప్రతినిధులకు విరాళాన్ని అందజేస్తున్న ఎంఇఒ చంద్రశేఖర్

పాఠశాల నిర్మాణానికి రూ. 25వేలు సాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మారుమూల ప్రాంతమైన ఇజ్జకాయిలో శిథిలమైన ఎంపిపి పాఠశాల నిర్మాణానికి ఎంఇఒ చంద్రశేఖర్ రూ.25వేలు ఆర్థిక సాయం చేశారు. సెప్టెంబర్‌లో వచ్చిన గాలి వానకు పాఠశాల పైకప్పు రేకు పూర్తిగా ఎగిరిపోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. బీరుపాడులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు వెళ్లారు. అక్కడ ఇజ్జకాయి గ్రామస్తులకు బీసీ రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, వైసిపి నాయకులు ఎం గోపాల్, ఎంపిడిఒ సాల్మన్ రాజు చేతుల మీదుగా ఈ నగదును అందజేశారు.

గ్రామస్తులకు బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సింగన్నవలసలో గడపగడపకు...

ప్రజాశక్తి -పాలకొండ

మండలంలోని సింగన్న వలస పంచాయతీ మల్లన్నగూడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, శాసనమండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ గ్రామగ్రామానికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలతో కూడిన కరపత్రాలు అందజేశారు. వైసిపి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కణపాక సూర్య ప్రకాశరావు, నగర పంచాయతీ వైసిపి అధ్యక్షులు వెలమల మన్మధరావు, బలగ మన్మధ రావు, గుంటుపల్లి కృష్ణ, బలగ కష్ణంనాయుడు, బలగ రమేష్, మామిడి రమేష, కోడి అప్పన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగ సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గౌరు నాయుడు

ప్రజాశక్తి - వీరఘట్టం



ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్, రహదారులు, భవనాలు, హెల్త్ పబ్లిక్, పంచాయతీరాజ్, మున్సిపల్ ఉద్యోగులు రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శిగా వి గౌరునాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన సంఘ సమావేశంలో నియమితులైనట్లు ఆయన తెలిపారు. ఆయన నియామక పట్ల సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఉపాధ్యక్షులుగా పాపయ్యరాజు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వైస్ ప్రెసి డెంటుగా విశాఖ రీజియన్ నుండి వైఎస్‌సిహెచ్ పాపయ్యరాజు ఎన్నికయ్యారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్న పాపయ్యరాజును ఎపి మున్సిపల్ మినిస్టీరి యల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా మంగళవారం ఎన్నుకున్నారు.

సీతంపేట లో 'నా నీరు నా మట్టి'

ప్రజాశక్తి - సీతంపేట

నా నీరు నా మట్టి కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపిడిఒ కె.గీతాంజలి కార్యదర్శులచే ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి పంచాయతీ నుంచి మట్టి సేకరించారు. ఈ మట్టిని ఢిల్లీకి సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.సత్యం, కార్యదర్శులు బి.సుదర్శనరావు కామేశ్వరరావు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం జెఎఎస్

ప్రజాశక్తి - కురుపాం

పేద ప్రజలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమమని, దీని ద్వారా ప్రభుత్వం గ్రామాల్లో అందిస్తున్న వైద్య సేవలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. మండలంలోని నీలకంఠాపురంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును పరిశీలించారు. వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన పలు విభాగాలను, మందులు నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వాలంటీర్లు, ఎఎన్ఎంల ఆరోగ్య సర్వేతో పాటు గ్రామ సచివాలయ పరిధిలోని సిహెచ్ఒ సర్వే జాబితా వివరాలు ఆధారంగా రోగులను గుర్తించి ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకుండా మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. ఆరోగ్య శ్రీ కింద ఉత్తమమైన పరిస్థితుల్లో వైద్యసేవలు పొందుటకు అందుబాటులో గల ఆసుపత్రుల గురించిన సమాచారం శిబిరానికి వచ్చే రోగులకు తెలియజేసి అవగాహన కల్పించాలని సూచించారు. శిబిరానికి వచ్చే వారికి అవసరమైన ఆరోగ్య చికిత్సలతో పాటు మనోధైర్యాన్ని నింపాలన్నారు. అనారోగ్యంతో అధిక డబ్బులు ఖర్చుపెట్టి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోకూడదన్న ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామాల్లో నిర్వహిస్తుందన్నారు. వైద్యశిబిరంలో సేవలు పొందుతున్న ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీయగా గ్రామంలో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండి సేవలు అందిస్తుండడంతో వైద్య పరీక్షల కోసం శిబిరానికి వచ్చామని, వైద్య శిబిరంలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని సంతప్తి వ్యక్తం చేశారు. ఆరోగ్యకర గ్రామాలకు జగనన్న సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ, ఎంపిడిఒ వివి శివరామప్రసాద్,వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని దయానిధిపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు అందుతున్న ఆరోగ్య పరీక్షలతో పాటు అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. రోగులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా కుర్చీలు ఏర్పాటు చేసి, వికలాంగులు, వద్ధులకు వీల్ చైర్ల సహకారంతో వారిని వైద్యుల వద్దకు తీసుకుని వెళ్లేలా చూడాలని ఎమ్మెల్యే సూచించారు.వృద్ధులను, వికలాంగులను, ప్రజలను ప్రత్యేకంగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకుని వారికి పూర్తి వైద్య సహాయ సహకారాలు అందేలా చూడాలని వైద్యులకు, ఆరోగ్య సిబ్బందికి ఆదేశించడం జరిగింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు మామిడి బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బలగ శ్రీరాములు నాయుడు, సర్పంచ్ తెంటు రామారావు, మాజీ సర్పంచ్ యాల్ల రాధాకృష్ణ, మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఎంపిడిఒ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గుమ్మలక్ష్మీపురం మండలంలో వైద్య సిబ్బంది ఇంటింటి ఆరోగ్య సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఎల్విన్ పేటలోని ఎంపీడీవో క్వార్టర్స్ వీధిలో మంగళవారం ఇంటింటి ఆరోగ్య సర్వే చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరం, బిపి, షుగర్, చర్మ వ్యాధులు, కంటి వ్యాధులకు సంబంధించి ఉన్నవారిని గుర్తించి పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 31న జరగబోయే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి రావాలని సూచిస్తున్నారు.

సాలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏడో సచివాలయం పరిధిలో ఉన్న ప్రజల కోసం నిర్వహించిన వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ పరిశీలించారు. అనంతరం రోగులకు కేస్ షీట్లు పంపిణీ చేశారు. 12వార్డు కౌన్సిలర్ వారి ఆప్యాయంగా తో కలిసి గర్భిణీ స్త్రీలకు సీమంతం నిర్వహించారు.అనంతరం సభలో మాట్లాడుతూ ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లి

కొమరాడ : వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాధరావు

మెరుగైన వైద్యం పొందలేని పేదల కోసం ప్రభుత్వం నిపుణులైన వైద్యులతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ శిబిరాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరానికి హాజరైన రోగులందరికీ వైద్య సేవలు అందించామని కమిషనర్ జయరాం తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, ఆర్ఐ అహ్మద్, శానిటేషన్ ఇన్ స్పెక్టర్ ఫకీర్ రాజు పాల్గొన్నారు.

పాచిపెంట : మండలంలోని కొటికిపెంటలో సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి బి ప్రమీల మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాల నాయుడు. వైస్ ఎంపిపి మీసాల నారాయణ, టి.గౌరీశ్వరరావు, సలాది అప్పలనాయుడు, ఎం.మధుసూదన్ రావు. డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శివకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు

శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

కొమరాడ: మండలంలోని గుణానాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు మంగళవారం తనిఖీ చేశారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఏర్పాటు చేసిన కౌంటర్లను సందర్శించారు. శిబిరానికి విచ్చేసిన వైద్య నిపుణులు, ప్రజలతో మాట్లాడారు. గ్రామాలు, వార్డుల్లో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారికి గ్రామాల్లోనే స్పెషలిస్టు వైద్యులతో సత్వర వైద్యం అందుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో ఔషధాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరం మేరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 70 వేల మంది ప్రజలు శిబిరాల్లో వైద్య సేవలు పొందారని ఆయన చెప్పారు. ఇందులో 7628 మందికి మధుమేహం ఉన్నట్లు, 12152 మందికి బిపి ఉన్నట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు రూరల్: మండలం పెద బోర బంద లో జగనన్న అరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఉద్దేశ్యంతోనే జగనన్న అరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షుల సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, జెసిఎస్ చైర్మెన్ కల్లేపల్లి త్రినాథ్‌నాయుడు, డిప్యూటీ డిఎంహెచ్ఒ శివ కుమార్, వైద్యులు, సచివాలయ, అంగన్వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని తుడిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.వెంకటరమణ, మండల ఉపాధ్యక్షులు పి.విజయకుమారి, తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, వైద్యాధికారులు జి.ప్రదీప్‌కుమార్, ఎస్ నితీశా, సచివాలయ కార్యదర్శి ఎ.చిన్నారావు, వైద్య, సచివాలయ సిబ్బందితో పాటు గ్రామ వాలంటీర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎండిపోతున్న వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఎండిపోతున్న వరిపంట పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో వర్షాల్లేక ఎండిపోతున్న వరి పంటను స్థానిక తహశీల్దార్ ఎంవి రమణ, మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాస్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలో 6 గ్రామాల్లో వర్షధారంపై ఆధార పడి వరి చేలు ఈ రకమైన ఎండిపోతున్నాయన్నారు. వరి పంట నష్టం ప్రాథమిక అంచనా జిల్లాకు అందజేస్తామన్నారు. ఎఒ మాట్లాడుతూ వర్షం పడక లేదా తేమ లేని వరి పంటలకు ఎకరాకు 2కేజీ లు 19:19:19 లేదా 13:0:45 లేదా మల్టీకె వంటి రసాయనాలు పిచికారీ చేసుకోవాలన్నారు. లీటర్ నీటికి 5మిల్లీలీటర్లు కలుపుకొని 14 నుండి 16 ట్యాంక్ లు పిచికారీ చేయాలన్నారు. అలా చేయడం వల్ల వారం నుండి పది రోజులు వరకు తేమ ఉండి మొక్కలు వాడిపోకుండా నివారించవచ్చునని తెలిపారు. అలాగే పూర్తిగా వాడి పోయిన వరి పంట నివేదిక పైఅధికారులకు పంపిస్తామని ఇప్పటి వరకు నిడగళ్లు, కోట సీతారాంపురం, వెన్నెల బుచ్చంపేట, సూరంపేట, పెదభోగిలిలో ఎద పంటలు 56 ఎకరాల వరకు సుమారుగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయన తో పాటు రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

19న వండువలో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండవలో ఈనెల 19న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి చుట్టు ప్రక్కల ఉన్న గ్రామ ప్రజల వినియోగించుకోవాలని ఆయన కోరారు.

విస్తృతంగా 'బాబుతో మేము' ప్రచారం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పట్టణంలో టిడిపి ఆధ్వర్యంలో మంగళవారం బాబు తోనే నేను అనే కార్యక్రమం విస్తృతంగా నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో పట్టణంలోని 5,8 వార్డుల్లో టిడిపి అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ డి శ్రీదేవితో కలిసి ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ చంద్రబాబుపై వైఎస్ జగన్మోహన్ రెడ్డి సాగిస్తున్న కక్షపూరిత చర్యలను వివరిస్తూ వారి మద్దతు కూడగట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, పోల సత్యనారాయణ, బార్నాల సీతారాం, బోను చంద్రమౌళి చంటి, కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, బడే గౌరీ నాయుడు, తాతపూడి వెంకటరావు, కోలా సరిత మధుతో పాటు మండలంలోని మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాచిపెంట : మండలంలోని కర్రివలస పంచాయతీ బొబ్బిలివలస, సీతంపేట, గైరమ్మ పేట గ్రామాల్లో మంగళవారం టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి ఆధ్వర్యంలో గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు, ముఖీ సూర్యనారాయణ, జి.యుగంధర్, కొత్తల పోలినాయుడు, రౌతు తిరుపతిరావు, దండి మోహనరావు, పల్లేడ ఉమా, చల్లా కనక, గొర్ల జగదీష్. జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : జియ్యమ్మవలస మండలం పిప్పలబద్రలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ గురించి గ్రామంలో ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరికీ వివరించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పల్ల రాంబాబు, అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్, ఎస్టీ సెల్ అరుకు పార్లమెంటు అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, అరుకు పార్లమెంట్ కొప్పలవెలమ సాధికార సమితి అధ్యక్షులు మూడడ్ల సత్యంనాయుడు, నీటి సంఘం మాజీ అధ్యక్షులు శివ్వాల నర్సింగరావు, జియ్యమ్మవలస గ్రామ సీనియర్ నాయకులు సోముల మాస్టరు, ఎల్.తాతబాబు, శిఖబడి మాజీ సర్పంచ్ సుదర్శన్ రావు , ఎల్.మోహన్ రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిఆమిటిలో...

గుమ్మలక్ష్మీపురం : బాబు తో నేను కార్యక్రమంలో భాగంగా మండలంలోని పి.ఆమిటి పంచాయితీ కారివలస, మొరంగూడ, పి. ఆమిటి కాలనీలో కురుపాం నియోజకవర్గ టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు అరెస్ట్ గురించి వివరించారు. అనంతరం నిరసన చేపట్టారు. చంద్రబాబుకు మద్దతుగా నిలవాలని

పాచిపెంటలో ప్రచారం చేస్తున్న నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి సంధ్యారాణి

కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు, బూత్ కమిటీ అధ్యక్షులు తాడంగి రామారావు, యూనిట్ ఇంచార్జ్ చిన్న, వెంకటరావు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని కడకెల్లలో మంగళవారం పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. చంద్రబాబు అక్రమ అరెస్టును ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయ్ భాస్కర్, ప్రధాన కార్యదర్శి చింత ఉమామహేశ్వరరావు, ఎన్.శశికుమార్, జి.రామకృష్ణ, యామక అప్పలనాయుడు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

టిడిపిలో 47 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పూతికవలసకు చెందిన వైస్ సర్పంచ్ వూయిక కామేశ్వరావు, మాజీ ఎంపిటిసి కూరంగి బాబురావుతో సహా 47 కుటుంబాలు పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయక్రిష్ణ సమక్షంలో తెలుగుదేశం పార్టీ లో చేరాయి. అనంతరం జయకృష్ణ మాట్లాడుతూ అవినీతి, అరాచక విధానాలతో వైసిపి పతనం ప్రారంభమైందని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, సీతంపేట మండల పార్టీ అధ్యక్షులు సవరతోట మొఖలింగం, బిసి సెల్ అధ్యక్షులు ఆర్.రంగనాథం, ఎస్ ఎసి అధ్యక్షులు గంట సుధ, సర్పంచ్ బిడ్డిక నీలయ్య, ఐటిడిపి కోఆర్డినేటర్ హిమరక పవన్, ప్రచారకర్త తోయిక సంధ్యారాణి, మాజీ ఎంపిటిసి ఆరిక సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మపేటలో తాగునీటి ఎద్దడి

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న బంగారమ్మపేటలో తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ప్రధానంగా దళిత కాలనీ వాసులు ఎక్కువగా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామంలో మూడు వేల మంది జనాభా ఉన్నారు. వీరిలో దళితులు రెండు వేల మంది ఉన్నారు. బిసిలు వేయి మంది వరకు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది రెక్కాడితే గాని డొక్కాడని బడుగు జీవులే. ఈ గ్రామంలో మూడు పబ్లిక్ కుళాయిలు వున్నాయి. ఎస్సీ కాలనీలో రెండు కుళాయిలు, బిసి కాలనీలో ఒకటి ఉన్నాయి. వీటి ద్వారా తాగడానికి సరిపడే నీరు అందడం లేదు. రెండు, మూడు బిందెల నీరు మాత్రమే అందుతున్న పరిస్థితి ఏర్పడింది. మరిన్ని పబ్లిక్ కుళాయిలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అయితే కొత్తగా పబ్లిక్ కుళాయిల మంజూరును ప్రభుత్వం నిలిపివేసింది. వ్యక్తిగత కుళాయిల మంజూరు జరుగుతోంది. ఈ కుళాయిలు

పైపులైన్ లీకుల వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

పట్టించుకోని అధికారులు ప్రజలు అవస్థలు

వేయించుకునే స్తోమత పేదదళితులు, బిసిలకు లేకపోవడంతో పబ్లిక్ కుళాయిలపైనే ఆధారపడుతున్నారు. ఇవేకాక పైలెట్ వాటర్ స్కీంలు ఏడు వున్నాయి. వీటి నిర్వహణ సక్రమంగా లేని కారణంగా తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ఉదయం 6 నుంచి 8వరకు మూడు పబ్లిక్ కుళాయిల ద్వారా తాగు నీరు సరఫరా జరుగుతుండడంతో సరిపడా నీరందడం లేదని దళితులు ఆందోళన చెందుతున్నారు. 25వవార్డు కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు కూడా వార్డులో తాగునీటి సమస్యను అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పట్టణంలో తాగునీటి సరఫరాకు సంబంధించి రూ.60కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టు పనులు పూర్తయితే తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని అధికారులు చెబుతున్నారు. అంతవరకు ట్యాంక్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాలని కౌన్సిలర్ ఈశ్వరరావు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టకపోతే 23 నుంచి నిరాహార దీక్ష

ప్రజాశక్తి - కొమరాడ

ఆంధ్రా - ఒడిశా అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులను ఈనెల 23లోపు మరమ్మతులు చేపట్టకపోతే గుమడ వద్ద నిరాహార దీక్ష చేపడతామని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి తెలిపారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ భుజంగరావుకు వినతిపత్రం సిపిఎం ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ ఇప్పటికైనా కొమరాడ మండల కేంద్రానికి సమీపంలోనూ రైస్‌మిల్ వద్ద, ఈశ్వరుని ఆలయం వద్ద గుమడ సమీపంలో గోతుల వద్ద, కొత్తూరు, గాంధీనగరం, కూనేరు వద్ద గల అంతరాష్ట్ర రహదారి మార్గంలో ఉన్న గోతులను కప్పాలని కోరారు. రెండేళ్ల పాటు పార్వతీపురం నుండి కూనేరు మీదుగా మూడు రాష్ట్రాలకు వెళ్లే అంతరాష్ట్ర రహదారి మార్గంలో ఉన్న గోతులను కప్పాలన్నారు. ఇలాంటి సందర్భంలో దీనికి స్పందించిన రోడ్లు, భవనాలు శాఖ అధికారులు అర్తం గ్రామ సమీపంలో 300 మీటర్లు దూరంలో బాగా తారు రోడ్డు వేశారు తప్ప మిగతా కోటిపాం, గుమడ, కొమరాడ, గాంధీనగర్, కూనేరు, కొమరాడ ఈశ్వరుని ఆలయం వద్ద గతంలో కప్పినప్పటికీ మళ్లీ గోతులు ఏర్పడడంతో ప్రతిరోజూ ఈ మూడు రాష్ట్రాలకు పరిమితికి మించిన వెళ్లే వాహనాలుదారులు, చిన్న చిన్న వాహనదారులు అనేక ప్రమాదాలకు గురై ఇప్పటికే గాయాలపాలై చనిపోయే పరిస్థితి ఉందని తెలిపారు. ఇలాంటి సందర్భంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తే తప్ప ఆ గోతులను రోడ్లు భవనాల శాఖ అధికారులు పూర్తి చేయకపోవడం చాలా అన్యాయమని అన్నారు. కావున రోడ్లు, భవనాల శాఖ అధికారులు పూర్తిస్థాయిలో స్పందించి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చేలా చర్యలు తీసుకొని ఈ రోడ్డు మరమ్మతు పనులు వెంటనే చేపట్టి అటు మూడు రాష్ట్రాలకు వెళ్లే వానాదారులకు ఇటు ప్రయాణికులకు అన్ని విధాలా భరోసా కల్పించాలని కోరారు. లేకుంటే ఈనెల 23న నిరసన తెలుపుతామని తెలిపారు.

హైరిస్క్ గర్భిణులను గుర్తించాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

పౌష్టికాహార లోపం, బరువు, ఎదుగుదల తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి తగు నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన మండలంలో ఉద్దవోలు, చినగుడబ, దళాయివలసను మంగళవారం ఆకస్మికంగా సందర్శించి అంగన్వాడీ కేంద్రాలను, వెల్నెస్ సెంటర్ తనిఖీ చేశారు. ప్రతినెలా పిల్లల బరువు, శారీరక ఎత్తు సరిగా నమోదు చేస్తున్నారా లేద అని, అలాగే పోషకాహార లోపం ఉన్న పిల్లలు ఎవరైనా ఉన్నారా అని రికార్డుల్లో పరిశీలించారు. పిల్లల బరువు, శారీరక ఎత్తును అక్కడ ఉన్న పరికరాలతో డిఐఒ స్వయంగా సరిచూచి పరిశీలించారు. గణాంకాలు పక్కాగా నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పిల్లలంతా పౌష్టికాహారం సరిగా తీసుకునేలా చూడాలన్నారు. ఐరన్ సిరప్‌ను విధిగా వారానికి రెండు సార్లు వేయించాలని ఆదేశించారు. పిల్లల ఆరోగ్య పరిశీలన చేశారు. ప్రతి నెలా పిల్లల బరువు ఏ మేరకు వృద్ధి చెందుతుందో గమనించాలని, లేని పక్షంలో ఎన్ఆర్సి కేంద్రాల్లో చేర్చాలని స్పష్టం చేశారు. అంగన్వాడీ, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి పిల్లల ఆరోగ్యం దష్టి సారించాలని,వారి తల్లిదండ్రులతో అవగాహన సదస్సు లను నిర్వహించి పిల్లల్లో ఎటువంటి ఆరోగ్య సమస్యలు



పిల్లల ఎత్తును పరిశీలిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

తలెత్తుతాయి, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రతలు, వాటి నివారణోపాయాలు వివరించాలన్నారు. అలాగే వెల్నెస్ కేంద్రాల్లో రికార్డులను ఆయన పరిశీలించి వారి పరిధిలో ఉన్న ఐదేళ్ల లోపు పిల్లలు, గర్భిణీలలో హైరిస్క్ ఉన్న వారిని గుర్తించి పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది బి. పార్వతి, ఎమ్.మౌనిక, జి.మౌనిక, అంగన్వాడీ సిబ్బంది ఎం.భవాని, బి.భారతి,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బొబ్బిలి

విజయనగరంలోని కెఎల్ పురం ప్రజా సంఘాల కార్యాలయంలో బుధ, గురువారాలు విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా జరగనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, మండల కార్యదర్శి ఎస్.గోపాలం కోరారు. రాష్ట్ర సదస్సు గోడ పత్రికలను మంగళవారం సిఐటియు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సదస్సులో ముఖ్యవక్తలుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా సిహెచ్.నర్సింగరావు, బి.తులసీదాస్ హాజరౌరతారని తెలిపారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, విద్యుత్ సంస్కరణలను ఆపాలని కోరుతూ విజయనగరంలో జరగనున్న సదస్సుకు ప్రజలంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నేరాలు ఘోరాలు

ఇద్దరు మున్సిపల్ సిబ్బందికి జైలు

ప్రజాశక్తి - విజయనగరం

2016లో కొత్తగా నిర్మించుకున్న ఇంటికి పన్ను విధింపునకు బాధితుడి నుంచి రూ.10వేలు లంచం తీసుకున్న కేసులో విజయనగరం మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పసుపురెడ్డి ఈశ్వరరావు, బిల్ కలెక్టర్ దుప్పలపూడి వెంకటేశ్వరరావుకు విశాఖ ఎసిబి కోర్టు మంగళవారం జైలు శిక్ష విధించింది. ఈశ్వరరావుకు మూడేళ్ల జైలు, రూ.10వేలు జరిమానా, వెంకటేశ్వరరావుకు ఆరు నెలల జైలు శిక్ష రూ.5వేలు జరిమానా విధించింది.

అత్యాచారం కేసులో 23ఏళ్లు జైలు శిక్ష

ప్రజాశక్తి - బొబ్బిలి

బాలికపై అత్యాచారం కేసులో యువకుడు గిరడ లక్ష్మణ అలియాస్ చిన్నకు జైలు శిక్ష పడిందని డిఎస్‌పి పి.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2019 జూన్ 17న పెంట గ్రామంలో అదే గ్రామంలో నివసిస్తున్న ఒక బాలికపై లక్ష్మణ అత్యాచారానికి పాల్పడ్డారు. అప్పటిలో ఎఎస్‌పి గౌతమిశాలి కేసు నమోదు చేసి కోర్టులో సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టి నేరాన్ని రుజువు చేయడంతో యువకుడుకి 23 సంవత్సరాల 6 నెలలు జైలుశిక్ష విధిస్తూ విజయనగరం స్పెషల్ ఫోక్సో న్యాయస్థానం న్యాయవాది కె.నాగమణి తీర్పు చెప్పినట్లు చెప్పారు.